www.nagaranijam.com PRGI/RNI NO: APTEL/2013/54450




# నగరనిజం

www.nagaranijam.com
అక్షరనిజం నగరనిజం
తెలుగు దిన పత్రిక

NNTV TELANGANA నగర నిజం

| సంపుటి : 14 | సంచిక :17 | ఉమ్మడి రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 10 శుక్రవారం, ఏప్రిల్ 2026 | పేజీలు : 4+ | ₹ 3 |
|---|---|---|---|---|---|---|
| Volume : 14 | Issue : 17 | Rangareddy | Editor : Yela.Purushotham | 10 Friday, APRIL 2026 | Pages : 4 + | Price : 3/- |

Published From Rangareddy,Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

## "అరైవ్ అలైవ్" కార్యక్రమంపై సమీక్ష... రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి

**రంగారెడ్డి, ఏప్రిల్ 09, (నగర నిజం) :**99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "అరైవ్ అలైవ్" కార్యక్రమం అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు గురువారం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్డు భద్రత కోసం చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రమాదాల సంఖ్య తగ్గడం లేదని తెలిపారు. వాహనాల పెరుగుదలతో పాటు అధిక వేగంతో వాహనాలు నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణమని చెప్పారు. జిల్లా కలెక్టర్లు స్థానిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని




రోడ్డు భద్రతకు సంబంధించిన చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాలను తక్షణమే నిర్వహించి వారాంతర "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈనెల 13 నుండి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా "అరైవ్ అలైవ్" కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. కార్యక్రమం ద్వారా ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం పెంచేందుకు వివిధ కార్యక్రమాలు చేపడతారని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ ప్రజల ప్రాణాలను కాపాడడం, సురక్షిత రహదారులు ఏర్పరచడం ప్రధాన లక్ష్యమని వివరించారు. రాష్ట్ర పోలీసు శాఖాధిపతి శివధర్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం పలు శాఖల సమన్వయంతో అమలు చేసే సమగ్ర చర్య అని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా పాదచారులు, ద్విచక్ర వాహనదారులు బాధితులవుతున్నారని, దీనిపై అవగాహన కార్యక్రమాలు అత్యవసరమని పేర్కొన్నారు. గత మూడు నెలల్లో రోడ్డు భద్రత చర్యల్లో గణనీయ పురోగతి సాధించినట్లు వెల్లడించారు.

### కార్యక్రమ షెడ్యూల్

ఏప్రిల్ 13న గ్రామ స్థాయి రోడ్డు భద్రత కమిటీల ఏర్పాటు, ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా విగ్రహాల వద్ద రోడ్డు భద్రత ప్రమాణం, ఏప్రిల్ 15న పిల్లల రోడ్డు భద్రత దినోత్సవం నిర్వహణ, ఏప్రిల్ 16న ప్రభుత్వ ఉద్యోగుల కోసం హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంపై ప్రచారం, ఏప్రిల్ 17న ప్రమాదాల అనంతర అత్యవసర స్పందన శిక్షణ, ఏప్రిల్ 18న ట్రాఫిక్ నియమాలపై కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి శ్రీనివాస్, డి ఆర్ ఓ సంగీత, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## పైప్ లైన్ నాచురల్ గ్యాస్ అమలుకు శాఖల సమన్వయం అవసరం



వంట గ్యాస్‌కు ప్రత్యామ్నాయంగా పైప్ లైన్ నాచురల్ గ్యాస్ వ్యవస్థను వేగవంతంగా అమలు చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి సూచించారు. గురువారం అదనపు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సంబంధిత శాఖల అధికారులతో కలిసి పైప్ లైన్ నాచురల్ గ్యాస్ వ్యవస్థీకరణపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ వినియోగానికి బదులుగా పైప్ లైన్ గ్యాస్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. రోడ్లు, జాతీయ రహదారులు, ఇతర ప్రదేశాల్లో పైప్ లైన్ నిర్మాణానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల్లో పైప్ లైన్ గ్యాస్ వినియోగంపై అవగాహన పెంచాలని, నిర్మాణంలో ఎదురయ్యే సమస్యలను శాఖల సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు. జిల్లాలో పైప్ లైన్ గ్యాస్ సేవలను త్వరగా అందుబాటులోకి తీసుకురావడానికి అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, సివిల్ సప్లయ్ అధికారి వనజాత, ఇంజనీరింగ్ విభాగ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

## పటాన్‌చెరులో బూత్ స్థాయి సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

**నగర నిజం సంగారెడ్డి జిల్లా ఏప్రిల్ 9:**పటాన్‌చెరు మండలానికి చెందిన బూత్ స్థాయి అధికారులు, వారి పర్యవేక్షకులు మరియు బూత్ స్థాయి ప్రతినిధుల కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం రుద్రారంలోని గీతం కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ హరిబాబు మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించే విధానాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో బూత్ స్థాయి సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారని, తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్ అమరేందర్ రెడ్డి, సహాయ మాస్టర్ ట్రైనర్లు చంద్రారెడ్డి, సయ్యద్, మధుసూదన్ రెడ్డి, శివలీల మరియు ఎన్నికల విభాగానికి



చెందిన సంతోష్ కుమార్ పాల్గొన్నారు. అదేవిధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా హాజరయ్యారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన శ్రీధర్ చారి, కాంగ్రెస్ పార్టీకి చెందిన నర్సింహారెడ్డి, ఖయ్యూం మతిన్ తమ తమ పార్టీ ప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ఎన్నికల విధుల్లో పారదర్శకత, సమన్వయం, ఖచ్చితత్వం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. బూత్ స్థాయి సిబ్బంది ప్రజాస్వామ్య ప్రక్రియను బలోపేతం చేయడంలో కీలకంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

## జూన్ 2 నుంచి స్కూల్ విద్యార్థులకు అల్పాహారం



**హైద్రాబాద్ ఏప్రిల్ 9::** జూన్ 2వ తేదీ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం ప్రారంభించనున్నట్లు ఉప.జవీ భట్టి విక్రమార్క తెలిపారు. అలాగే రానున్న విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందించనున్నట్లు వివరించారు. అలాగే 100 యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మాణం చేపట్టామన్నారు. ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభిస్తామని చెప్పారు. అంతరాలు లేని, ఆదర్శ సమాజం విద్య ద్వారానే సాధ్యమని వివరించారు.

నూతన కాలనీలకు మంచి నీరు అందించండి

## జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే జిఎంఆర్



**నగర నిజం ఏప్రిల్ 09** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గంలోని జలమండలి పరిధిలోగల నూతన కాలనీలకు సైతం రక్షిత మంచినీరు అందించేందుకు నిధులు కేటాయించాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కోరారు. గురువారం హైదరాబాద్ లోని జలమండలి కార్యాలయంలో ఎండి అశోక్ రెడ్డి ని కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ప్రధానంగా అమీన్పూర్ డివిజన్ పరిధిలోని కిష్టారెడ్డిపేట గ్రామం, రాజరాజేశ్వరి కాలనీ ఫేజ్ 2, సృజన లక్ష్మీ కాలనీ ఫేజ్ 4, టైలర్స్ కాలనీ, లింగమయ్య కాలనీ, కె ఎస్ ఆర్ కాలనీలలో మంచినీటి సరఫరా లేకపోవడంతో ప్రజల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుత వేసవి కాలంలో ప్రతి రోజు ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తుందని తెలిపారు. పైన పేర్కొన్న కాలనీలలో నూతన పైపులైన్ల ఏర్పాటు కోసం ఇప్పటికే ప్రతిపాదనలు తయారు చేయడం జరిగిందని.. రెండు కోట్ల నిధులు మంజూరు చేస్తే నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎండి అశోక్ రెడ్డి.. అతి త్వరలో నిధుల మంజూరుకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపినట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ పేర్కొన్నారు.







# ప్రభుత్వ భూముల కబ్జాపై ఎంపీ రఘునందన్ రావు ఆగ్రహం





- రాత్రికి రాత్రి ప్రభుత్వ పాఠశాల గదుల కూల్చివేతపై ధ్వజం
- కలెక్టర్ స్పందించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్

**నగర నిజం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు, ఏప్రిల్ 9** గడిచిన పదేళ్ల బిఆర్ఎస్ పాలనలోనూ, ప్రస్తుత రెండేళ్ల కాంగ్రెస్ పాలనలోనూ కొందరు నాయకులు ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూములను కబ్జా చేసి దోచుకుంటున్నారని మెదక్ పార్లమెంట్ సభ్యులు యం. రఘునందన్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. గురువారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణ కేంద్రంలో జాతీయ రహదారి విస్తరణ పనుల సాకుతో జరుగుతున్న భూకబ్జాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పటాన్‌చెరులోని సర్వే నంబర్ 428లో సుమారు 2 ఎకరాల 18 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. జాతీయ రహదారుల విస్తరణ అనేది కేంద్ర ప్రభుత్వం కేవలం ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన పనులని, ఈ అభివృద్ధి పనులకు, కబ్జాదారులకు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గదులను రాత్రికి రాత్రి కూలగొట్టడం దుర్మార్గమని ఎంపీ ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి విస్తరణ పాఠశాల కాంపౌండ్ వాల్ బయట జరగాల్సి ఉండగా, హద్దులు దాటి పాఠశాల గదులను ఎందుకు కూల్చివేశారని ఆయన అధికారులను ప్రశ్నించారు."ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. విద్యా మందిరాలను కూల్చివేస్తుంటే చూస్తూ ఊరుకోం. దీని వెనుక ఉన్న ఆంతర్యమేమిటో బయటపడాలి."పాఠశాల గదులను కూల్చిన మిషనరీ యజమానులపై, కాంట్రాక్టర్లపై మరియు ఇందుకు బాధ్యులైన వారిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. జిల్లా కలెక్టర్ మరియు ఉన్నతాధికారులు ఈ ఘటనపై తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలనీ విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# నేడే కేఎస్ పీపీ నాలుగో స్నాతకోత్సవం

- ముఖ్య అతిథిగా హాజరు కానున్న నీతి ఆయోగ్ పూర్వ సీఈఓ అమితాబ్ కాంత్



**నగర నిజం సంగారెడ్డి ఏప్రిల్ 09** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కేఎస్ పీపీ) 2026 బ్యాచ్ విద్యార్థుల కోసం నాలుగో పట్టభద్రుల దినోత్సవాన్ని శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నారు. ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలువనున్న ఈ కార్యక్రమంలో 35 మంది పట్టభద్రులు ప్రజా విధానం, పరిపాలనా రంగంలోకి అడుగుపెడుతు న్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నీతి ఆయోగ్ మాజీ ముఖ్య కార్యనిర్వహ ణాధికారి, భారతదేశపు జీ-20 షెర్పా అయిన అమితాబ్ కాంత్ విచ్చేస్తున్నారు. విశిష్ట సంస్కర్త, మేధో నాయకుడైన ఆయన, భారతదేశపు జీ-20 అధ్యక్షత సమ యంలో కీలక పాత్ర పోషించి, చారిత్రాత్మకమైన న్యూఢిల్లీ నాయకుల ప్రకటనకు తోడ్పడ్డారు. ప్రజా సేవలో విశిష్టమైన వృత్తి జీవితం గడిపిన అమితాబ్ కాంత్, స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, వ్యాపార సౌలభ్య సంస్కరణల వంటి పరివర్తనాత్మక కార్యక్రమాలకు నాయకత్వం వహించి, భారతదేశ ఆర్థిక, పాలనా స్వరూపాన్ని గణనీయంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో పట్టభద్రులైన విద్యార్థుల బృందం యొక్క విజయాలను వేడుకగా జరుపుకోవడంతో పాటు, సమ్మిళిత వృద్ధికి, దేశ నిర్మాణానికి అంకితమైన భవిష్యత్ నాయకులను తీర్చిదిద్దడంలో కేఎస్ పీపీ యొక్క నిబద్ధతను పునరుద్ఘాటించనున్నారు.

# క్క జంగయ్య గౌడ్ కుటుంబానికి కొత్తకుర్మ సత్తయ్య బాసట



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 9 ( నగరనిజం ) :** ఆపదలో ఉన్న తెలంగాణ ఉద్యమకారులు నక్క జంగయ్య గౌడ్ కుటుంబానికి టీజీకాబ్ మాజీ వైస్ చైర్మన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య బాసటగా నిలిచారు. ఆపదలో ఉన్న తెలంగాణ ఉద్యమకారుడు నక్క జంగయ్య గౌడ్ కుటుంబానికి టీజీకాబ్ మాజీ వైస్ చైర్మన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అండగా నిలిచారు. జంగయ్యగౌడ్ కూతురు అనూష కాలేయం సమస్యతో బాధపడుతోంది. ఆరోగ్యం బాగుపడాలంటే వైద్యులు రూ.80 లక్షల వరకు ఖర్చవుతుందని తెలిపారు. పేద కుటుంబానికి చెందిన జంగయ్య గౌడ్ అంత ఖర్చుపెట్టి వైద్యం చేయించుకునే పరిస్థితి లేదు. దీంతో విషయం తెలుసుకున్న కొత్తకుర్మ సత్తయ్య గురువారం రూ. 25 వేల రూపాయల చెక్కును జంగయ్యకు అందించారు. అలాగే ప్రభుత్వంతో, ప్రజాప్రతినిధులతో మాట్లాడి వైద్య ఖర్చులకు అయ్యే డబ్బు సమకూరేలా చూస్తామని హామీ ఇచ్చారు. కడు పేదరికంలో పుట్టిన కుటుంబాన్ని మానవతా వాదులు ఆదుకోవాలని కోరారు. నక్క జంగయ్యకు సాయం చేయదలిచినవారు ఫోన్ నెంబర్ 9347096677ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు జెనిగె విష్ణువర్ధన్, కొంతం యాదిరెడ్డి, కారింగుల నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బేటి బచావో-బేటి పడావో కింద కుట్టు యంత్రాల పంపిణీ, శిక్షణ ప్రారంభం




**నగర నిజం సంగారెడ్డి, ఏప్రిల్ 9:**,జిల్లాలో మహిళల ఆర్థిక స్వావలంబనకు మరొక ముందడుగు పడింది. బేటి బచావో-బేటి పడావో పథకం కింద మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, కుట్టు యంత్రాల పంపిణీతో పాటు బ్యూటీషియన్ శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో-బేటి పడావో పథకం కింద గురువారంసంగారెడ్డి స్థానిక బాలసదనంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 50 మంది లబ్ధిదారులకు కుట్టు యంత్రాలను పంపిణీ చేయగా, మరో 25 మంది లబ్ధిదారులకు బ్యూటీషియన్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ప్రత్యేకంగా ఆర్థికంగా వెనుకబడిన మహిళలు, ఒంటరి మహిళలు, వితంతువులు, చదువు మధ్యలో మానేసిన వారు మరియు ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని టీజీఐసీసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మొక్కలునాటారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి టీజీఐసీసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, బేటి బచావో-బేటి పడావో పథకం ద్వారా కుట్టు యంత్రాల పంపిణీ, బ్యూటీషియన్ శిక్షణలతో మహిళల జీవనోపాధి మెరుగుపడుతుందని తెలిపారు. స్వయం ఉపాధి ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని మహిళలకు సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్ మాట్లాడుతూ మహిళలు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారిణి లలితా కుమారి మహిళా శిశు సంక్షేమ శాఖ అమలు చేస్తున్న పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వ యకర్త పల్లవి, సీడీపీఓ చంద్రకళ,డిసిపిఓ రత్నం, చిల్డ్రన్ సూపరింటెండెంట్ విజయ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# పెద్దాపురం మోడల్ స్కూల్లో ఇంటర్ విద్యార్థులకు వేసవి ఇంటర్న్‌షిప్ కార్యక్రమం

- ప్రిన్సిపాల్ జి. భాగ్యలక్ష్మి



**నాంపల్లి,నగర నిజం:**నల్గొండ జిల్లా నాంపల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఒకేషనల్ కోర్సులో భాగంగా ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం మార్చి 30న ప్రారంభమై 10 రోజుల పాటు(సెలవులు మినహా) కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు. ఒకేషనల్ కోర్సులకు చెందిన బ్యూటీ డ వెల్నెస్ మరియు హెల్త్ కేర్ విభాగాలకు చెందిన విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ఈ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విధ్యార్థులు పాఠ్య పుస్తకాల పరిజ్ఞానాన్ని మాత్రమే కాకుండా వాస్తవ జీవిత అనుభవాన్ని కూడా పొందే విధంగా ఉంటుందని జి. భాగ్యలక్ష్మి గారు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో ఒకేషనల్ టీచర్లు షేక్ షాకీరా బేగం, పోతగాని మమత ముఖ్యపాత్ర పోషిస్తున్నారు.



# రాష్ట్రంలో పెరిగిపోతున్న భూకబ్జాలు

- ప్రధాని కలిసి సిబిఐ విచారణ జరిపిస్తాం.
- రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య



**హైద్రాబాద్ ఏప్రిల్ 9;** రాష్ట్రంలో భూకబ్జాలు - అవినీతి విచ్చలవిడిగా హద్దు పద్దు లేకుండా పెరిగిపోయింది. దీనిని అరికట్టవలసిన ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. పైగా ప్రభుత్వ అధినేతలే అక్రమాలకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై టిఆర్ఎస్ నేతలు - టిఆర్ఎస్ నేతలపై మంత్రులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. రాజకీయ నాయకులు ముఖ్యంగా పదవులలో ఉన్న మంత్రులు, శాసనసభ్యులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల అక్రమాస్తులపై వారి హయంలో జరిగిన అధికారం దుర్వినియోగం - అవినీతి అక్రమాలపై సిబిఐ విచారణ జరపాలని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఇంత అవినీతి జరుగుతున్న కొందరు మంత్రులు కొందరు అధికారులు వేల లక్షల కోట్లు అక్రమా ఆస్తులు సంపాదిస్తున్న రాజకీయ పార్టీలు - ప్రతిపక్షలు ప్రత్యేక్ష పాత్ర పోషిస్తున్నారు తప్ప దీనిపై సమగ్ర విచారణ జరపాలని కోరడంలేదు. అందుకే త్వరలో ప్రధానమంత్రిని కలిసి సిబిఐ విచారణ కోరన్నట్లు కృష్ణయ్య తెలిపారు. ఇంత అవినీతి పాలన అక్రమ పాలన ప్రజలను పట్టించుకొని ప్రభుత్వాలను నా 50 సంవత్సరాల ఉద్యమ కాలంలో చూడలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో నలుగురు మంత్రులు, కొందరు ఐఏఎస్ అధికారులు కలెక్టర్లు కుమ్మక్కై రాష్ట్రాన్ని లూటి చేస్తున్నారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమ గాలికి వదిలేసారు. గత 13 సంవత్సరాల లో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలి. ధనిక రాష్ట్రం - మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రం నేడు 10 లక్షల కోట్లకు పైగా అప్పుల పాలయింది. విచిత్ర ఏమిటంటే ఈ దోపిడీ దొంగలు భూమి ఆస్తులు కాజేయడమే గాక తెచ్చిన అప్పులతో కూడా కాంట్రాక్టర్ల పేరు మీద కోట్లు కొల్లగడుగుతున్నారన్నారు. రాష్ట్రాన్ని అదోగతి పాల్జేశారు. ప్రజల అభివృద్ధి - సంక్షేమాన్ని గాలికి వదిలేశారు. విద్యార్థులకు ఫీజులు - స్కాలర్ షిప్ లు ఇవ్వడం లేదు. అంతేకాదు బి.సి హాస్టళ్ళు - గురుకులాలకు స్వంత భవనాలు నిర్మించడం లేదు. ప్రభుత్వ స్థలాలు - ప్రజల ఆస్తులు వీటిని ప్రజా అవసరాలకు, పేదల ఇండ్లు కట్టడానికి ప్రభుత్వ ఆఫీసులకు హాస్టళ్ళకు, స్కూల్ కు నిర్మాణానికి ఉపయోగించాలి. అంతే గాని కబ్జాలు చేయడానికి అమ్మడానికి కాదు. ఇప్పుడు అమ్మితే కబ్జాలు భావితరాలకు ఏమి ఉంటుందని ప్రశించారు. గతంలో కూడా ప్రభుత్వాలు అమ్మడానికి ప్రయత్నం చేశారు. అప్పుడు మేము గట్టిగా వ్యతిరేకించడంతో అమ్మడాని ఆపేశారు. ఇప్పుడు కూడా ప్రభుత్వ భూమి అమ్మడం ఆపేయాలి. ప్రభుత్వ స్థలాలను వేలం వేయరాదు. ఇది బీసీ కాలేజీ హాస్టళు ళ్ళ, బీసీ గురుకుల పాఠశాలకు సొంత భవనాలు నిర్మించడానికి ఇళ్ళు లేని పేదలకు పంచడానికి, అడవులు పెంచడానికి వాతావరణం కాలుష్యం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇది బీసీ/ఎస్‌సి/ఎస్‌టి కాలేజీ హాస్టళ్ళు, బీసీ గురుకుల పాఠశాలకు సొంత భవనాలు, నిర్మించాలని డిమాండ్ చేశారు. అద్దె భవనాలలో చాలీ-చాలని వసతులతో విద్యార్థులు కిక్కిరిసి యున్నారు. హాస్టల్ గదులు కిక్కిరిసిపోయాయి. 5మంది విద్యార్థులు యుండవలసిన గదులలో 20 నుంచి 30 మంది ఉంటున్నారు. కొత్త బిల్డింగులు తీసుకోవడం లేదు. ఒకే భవనంలో 3 హాస్టళ్ళను నడుపుతున్నారు. విద్యార్థుల సౌకర్యం కల్పించాలనే కోణంలో చూడకుండ ప్రభుత్వానికి డబ్బు ఎలా మిగిల్చాలని అధికారులు చూస్తున్నారు. దీని వలన విద్యార్థులు ఆరోగ్యం దెబ్బతింటుంది. చదువు దెబ్బతింటుంది. జాతి సంపద దెబ్బ తింటుంది. పైగా ఏటా అద్దె కింద కోట్ల రూపాయలు ఖర్చవుతుంది. కావున అన్ని వసతులతో స్వంత భవనాలు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు పంచాలని కోరారు. హాస్టళ్లకు, గురుకులాలకు ఇచ్చిన తరువాత అమ్మకాలకు పోవాలన్నారు. ఇంకొక వైపు నగరాలలో చెట్లు పెంపకం లేక వాతావరణ కాలుష్యం పెరిగిపోతుంది. కబ్జా దారుల నుండి భూములను కాపాడుకోవాల్సిన అవసరంయుంది. ఒకవైపు పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించకుండా ఇబ్బంది పడుతుంటే ప్రభుత్వం ప్రభుత్వ స్థలాలను వేలం వేస్తూ మంత్రులు కబ్జా దొరలకు వందల కోట్ల రూపాయలకు అమ్ముకుంటూ ఉన్నారు. ప్రభుత్వ స్థలాలు ఇల్లు లేని పేద ప్రజలకు కేటాయించాలి. కానీ వేలం వేయడం - అమ్మే హక్కు ప్రభుత్వానికి లేదు. ప్రభుత్వ స్థలాలు అమ్మ రాదని వ్యతిరేకిస్తూ ప్రజలందరూ తిరుగుబాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కొందరు రెవెన్యు అధికారులు పేద ప్రజలకు ఇళ్ళ స్థలాలు కేటాయించి రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కయి. కోట్ల రూపాయలు అక్రమ సంపాదనకు అలవాటు పడ్డారన్నారు. త్వరలో ప్రధానమంత్రిని సిబిఐ విచారణకు డిమాండ్ చేస్తున్నాం. హైదరాబాద్ మహానగరంలో 6 లక్షల మంది పేద ప్రజలు బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాలకు చెందిన చెందిన పేద ప్రజలు ఇంటి అద్దాలు చెల్లించలేక బ్రతుకు భారమై జీవిస్తుంటే ప్రజాపాలన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు అమ్ముకుంటూ రాష్ట్రాన్ని దోపిడి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

## రేషన్ కార్డుదారులకు బిగ్ అలర్ట్..

- మొదలైన అనర్హుల ఏరివేత



**హైద్రాబాద్ ఏప్రిల్ 9:** రాష్ట్రంలో ఆదాయ పన్ను చెల్లించేవారి ఆహార భద్రత కార్డులను తొలగించేందుకు కేంద్రం సిద్ధమైంది. లబ్ధిదారుల ఆధార్, పాన్కార్డు వివరాలను ఆదాయ పన్నుశాఖ ద్వారా సేకరించి, వారి ఆర్థిక పరిస్థితులను పరిశీలించి కార్డులను కట్ చేయనుంది. ఖరీదైన వాహనాలు కలిగివున్న వారి రేషన్ కూడాబంద్కానుంది. 83,545 మంది మరణించిన వారికి రేషన్పంపిణీ జరుగుతుండగా.. నిబంధనలకు విరుద్ధంగా రూ.135 కోట్లు ఖర్చు అవుతోంది. పీఎం కిసాన్డేటా ఆధారంగా 52,339 మంది ఆదాయ పన్ను చెల్లిస్తున్నట్టు తేలింది. 5866 మందికి 15 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉండగా రైతు భరోసా ద్వారా ఏటా వీరికి 1.50 లక్షల ఆదాయం మించింది. రాష్ట్రంలో రేషన్కార్డుల సంఖ్య 1.05 కోట్లకు చేరుకోగా అందులో ఆహార భద్రత కార్డుల కింద కేంద్రం 99.36 లక్షల కార్డులు మంజూరు చేసి ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. ఏటా లక్షల రూపాయలు ఐటీ చెల్లిస్తూ తాము పేదలమని చాలామంది నెలవారీగా ఉచిత బియ్యం తీసుకుంటున్నానే గత రెండేళ్లుగా ఫిర్యాదులు అందుతున్నాయి. పేదల ముసుగులోరేషన్కార్డు పొందేందుకు ఏడాదికి పట్టణాల్లో రూ.2 లక్షల ఆదాయం, గ్రామాల్లో రూ.1.50 లక్షల ఆదాయంలోపు ఉండాలనే నిబంధనలు ఉన్నాయి. కానీ అందుకు విరుద్ధంగా నెలకు లక్ష రూపాయలు ఆదాయం వచ్చే కుటుంబాలు కూడా నిరుపేదల కింద రేషన్కార్డులు తీసుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. వీరంతా రేషన్బియ్యం తినకుండా బ్లాక్మార్కెట్లో అమ్ముకుంటున్నట్టు బయటపడింది. ప్రభుత్వం ఎన్ని కఠిన నిబంధనలు తీసుకొచ్చిన పీడీఎస్రైస్నుదర్జాగా పక్కదారి పట్టిస్తున్నారు. ధనవంతులు ప్రభుత్వ రూల్స్పాటించకుండా పేద కుటుంబాల ముసుగులో నిజమైన లబ్దిదారులకు అందాల్సిన సంక్షేమ పథకాలు, రుణాలను కాజేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### రేషన్ మాఫియా

తెలంగాణలో రేషన్కార్డు కలిగివున్న దాదాపు 8 లక్షలకుపైగా కుటుంబాలకు ఏటా రూ.25 లక్షల ఆదాయం ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వీరిపై స్థానికంగా ఉండే విపక్ష పార్టీల నేతలు ఫిర్యాదులు చేశారు. వీరంతా ఏటా దాదాపుగా 1.50 లక్షల మెట్రిక్టన్నుల ఉచిత బియ్యం తీసుకుని రేషన్మాఫియాకు ఇస్తున్నట్టు వెలుగులోకి వచ్చింది. ఇంతటితో ఆగకుండా ఆయా సంక్షేమ శాఖలో పలు పథకాలు పొందడంతో పాటు, పిల్లల చదువుల కోసం రుణం తీసుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని వినియోగించుకోవడంలో ముందు వరుసలో ఉన్నారు. రేషన్బియ్యంతో వచ్చే ఆదాయంతో పాటు ప్రభుత్వ పథకాలు అప్పన్నంగా పొందినట్లు ఆరోపణలున్నాయి.

### అధికారుల నిర్లక్ష్యం

బీఆర్ఎస్పాలనలో అడ్డగోలుగా కార్డులు మంజూరు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ప్రభుత్వంలో కూడా కోటీశ్వరులు రేషన్కార్డులను దర్జాగా పొందారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్నవారి ఇంటింటికి వెళ్లి పరిశీలిన చేసిన మండలంలోని అధికారులు ముడుపులు ముట్టగానే చేతులు దులుపుకున్నట్లు తేలింది. ఇటీవలే కేంద్ర ఆహార, పంపిణీ శాఖ సహాయ మంత్రి పార్లమెంటులో తెలంగాణ రాష్ట్రంలో 1.40 లక్షల రేషన్కార్డులను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ప్రకటించారు. కేంద్రం గుర్తించిన జాబితాను ఇప్పటికే తెలంగాణ పౌరసరఫరాల శాఖకు పంపినట్లు తెలిపింది. నిబంధనలకు విరుద్ధంగా కార్డులు పొందిన వారికి నోటీసులు జారీ చేసి, ఎందుకు తొలగిస్తున్నారో కూడా వివరించాలని పేర్కొంది. దీంతో జిల్లా పౌరసరఫరాల అధికారులు ఆ దిశగానే చర్యలకు సిద్ధమవుతున్నారు..

# శంషాబాద్ విమానాశ్రయంలో భారీగా ఖరీదైన చేతి గడియారాలు పట్టివేత

- శంషాబాద్ విమానాశ్రయంలో భారీగా రోలెక్స్ గడియారాలను స్వాధీనం చేసుకున్న కస్టమ్స్ అధికారులు
- దుబాయ్ నుండి హైదరాబాద్ వచ్చిన నిందితులు
- ఆదాయపన్ను శాఖ అధికారులకు సమాచారం అందించిన కస్టమ్స్ అధికారులు
- విచారణ చేపట్టిన ఆదాయ పన్ను శాఖ అధికారులు





**రాజేంద్రనగర్, ఏప్రిల్ 9 (నగరనిజం ప్రతినిధి):** శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా ఖరీదైన చేతి గడియారాలు పట్టుబడడం కలకలం రేపింది. దుబాయ్ నుండి హైదరాబాద్ వచ్చిన ఇద్దరు ప్రయాణికుల నుండి ఖరీదైన 30 రోలెక్స్ చేతి గడియారాలను స్వాధీనం చేసుకున్నారు కస్టమ్స్ అధికారులు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్న కస్టమ్స్ అధికారులు.... ఈ మేరకు ఆదాయ పన్ను శాఖ అధికారులకు సమాచారం అందించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.... దుబాయ్ నుండి ఎమిరేట్స్ విమానంలో హైదరాబాద్ వచ్చిన ఇద్దరు ప్రయాణికుల లగేజీ బ్యాగులను స్కానింగ్ చేసిన కస్టమ్స్ అధికారులు.... 30 రోలెక్స్ ఖరీదైన చేతి గడియారాలను గుర్తించారు. అయితే వీరు వ్యాపారంలో భాగంగా వీటిని కొనుగోలు చేసి హైదరాబాద్ తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నిందితులు ఇద్దరినీ అదుపులోకి తీసుకున్న కస్టమ్స్ అధికారులు.... ఆదాయపన్ను శాఖ అధికారులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన ఐటీ శాఖ అధికారులు.... నిందితులను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. అయితే వీరు వ్యాపారంలో భాగంగానే అన్ని అనుమతులతో రోలెక్స్ చేతి గడియారాలను కొనుగోలు చేసినట్లుగా తెలుస్తోంది. ఇందుకు సంబంధించి సదరు ప్రయాణికులు రోలెక్స్ వాచ్ ల కొనుగోలు పత్రాలను ఐటి శాఖ అధికారులకు సమర్పించినట్లు చెబుతున్నారు. దీంతో ఐటీ శాఖ అధికారులు రోలెక్స్ వాచ్ ల లావాదేవీలకు సంబంధించిన వివరాలను ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.






## ప్రభుత్వ పాఠశాలకు ఎలక్ట్రిక్ బెల్ అందజేత



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 9 ( నగరనిజం ) :** యాచారం మండల పరిధిలోని కుర్మిద్ద ఎంపీయూపీఎస్ 1993 - 2002 బ్యాచ్ 7వ తరగతి పూర్వ విద్యార్థులు గత నెలలో నిర్వహించుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో తమ చదువుకున్న పాఠశాలకు ఎలక్ట్రిక్ బెల్ అందజేయాని సంకల్పించారు. ఈ మేరకు గురువారం పూర్వ విద్యార్థులు పాఠశాలను సందర్శించి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తు పాండురంగారెడ్డి సమక్షంలో ఎలక్ట్రికల్ బెల్ అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ... తాము చదువుకున్న పాఠశాలకు ఎలక్ట్రికల్ బెల్ అందజేయడం బాధ్యతాయుతంగా భావిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ,సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. తాము చదువుకున్న పాఠశాలకు ఎలక్ట్రికల్ బెల్ అందజేయడం ఆనందంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు కల్లెపల్లి జాన్, మేడమోని రవి, తదితరులు పాల్గొన్నారు.

## 24వ రోజుకు చేరిన... కన్నెత్తి చూడని అధికారులు



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 9 ( నగరనిజం ) :** 24 రోజులుగా గిరిజన రైతుల దీక్షలకు ప్రభుత్వ అధికారుల స్పందన కొరవడిందని రైతులు తెలిపారు. యాచారం మండలం మర్లకుంటతండాలో ఫ్యూచర్ సిటీ గ్రీన్ ఫీల్డ్ రోడ్డు వద్దని నిరవధిక దీక్షలు కొనసాగుతున్నాయి. నిషేధిత జాబితాలో ఉన్న భూమిని ఆన్లైన్ లో నమోదు చేసి రైతులకు న్యాయం చేయాలని దీక్ష చేస్తుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని రైతులు మండిపడ్డారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. అధికారులు దిగొచ్చి సమస్యను పరిష్కరించేంతవరకు దీక్ష ఆపే ప్రసక్తే లేదని గిరిజన రైతులు తేల్చి చెప్పారు. దీక్షలో గిరిజన రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# కొత్వాల్ గూడ వద్ద కాంక్రీట్ మిషన్ల నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోండి





- సీపీఐ
- శంషాబాద్ ఎమ్మార్వో రవీందర్ దత్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన సీపీఐ నేతలు నర్రాగిరి, రాచమల్ల యాదగిరి

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 9 (నగరనిజం ప్రతినిధి):** శంషాబాద్ పరిధిలోని కొత్వాల్ గూడ వద్ద హిమాయత్ సాగర్ పరివాహ ప్రాంతంలో అక్రమంగా కొనసాగుతున్న కాంక్రీట్ మిషన్ల వ్యవహారంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వో రవీందర్ దత్ కు పలువురు సీపీఐ నేతలు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కాంక్రీట్ మిషన్లను కొనసాగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు ఎమ్మార్వోకు లిఖితపూర్వకంగా పిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం నాడు సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు రాచమల్ల యాదగిరి, పార్టీ శంషాబాద్ మండల కార్యదర్శి నర్రాగిరి శంషాబాద్ ఎమ్మార్వో రవీందర్ దత్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ మేరకు శంషాబాద్ పరిధిలోని కొత్వాల్ గూడ హిమాయత్ సాగర్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా కాంక్రీట్ మిషన్లను నడుపుతున్నారని ఎమ్మార్వో కు లిఖిత పూర్వకంగా పిర్యాదు చేశారు. జీవో 111 నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ కాంక్రీట్ మిషన్లను నడుపుతున్నడంతో హిమాయత్ సాగర్ పరివాహక ప్రాంతం కలుషితమవుతోందని రాచమల్ల యాదగిరి, నర్రా గిరి ఆందోళన వ్యక్తం చేశారు. హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ జంట జలాశయాలను పరిరక్షించడానికి గాను గతంలో ఇక్కడ నెలకొల్పిన క్వారీ పరిశ్రమలను అన్నింటినీ మూసివేయడం జరిగిందని వారు ఎమ్మార్వో దృష్టికి తీసుకెళ్లారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా కొందరు అక్రమార్కులు హిమాయత్ సాగర్ పరిసర ప్రాంతాల్లో గుట్టు చప్పుడు కాకుండా కాంక్రీట్ మిషన్లను కొనసాగిస్తున్నారని రాచమల్ల యాదగిరి, నర్రా గిరి ఎమ్మార్వో రవీందర్ దత్ కు ఫిర్యాదు చేశారు. అధికారులు తక్షణమే స్పందించి అక్రమంగా కొనసాగుతున్న కాంక్రీట్ మిషన్లను మూసి వేయించడంతోపాటు వాటిని కొనసాగిస్తున్న అక్రమార్కులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వారు ఎమ్మార్వో ఒక విజ్ఞప్తి చేశారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోకపోతే సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని రాచమల్ల యాదగిరి, నర్రా గిరి హెచ్చరించారు.

# తహసీల్దార్ కార్యాలయంలో 'ముక్కున వేలేసుకుంటున్న' జనం!

- మరుగుదొడ్ల దుర్వాసనతో దారుణంగా మారిన కార్యాలయం..
- శుభ్రతను గాలికొదిలేసిన అధికారులు




**నగర నిజం ఏప్రిల్ 09** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయం ప్రస్తుతం సమస్యల నిలయంగా మారింది. నిత్యం వందలాది మందితో కిటకిటలాడే ఈ ప్రభుత్వ కార్యాలయంలో అడుగు పెట్టాలంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతు న్నారు. కారణం.. అక్కడ నెలకొన్న తీవ్రమైన అపరిశుభ్రత మరియు భరించలేనంత దుర్వాసన. కార్యాలయంలోని మరుగుదొడ్లను శుభ్రం చేయకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. అసౌకర్యాల మధ్యే పాలన సాధారణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన కార్యాలయంలో కనీస సౌకర్యాలు లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరుగుదొడ్ల నిర్వహణ లోపంతో ఆ దుర్వాసన మొత్తం కార్యాలయం లోపలికి వ్యాపిస్తోంది. దీంతో పనుల నిమిత్తం వేచి ఉండే అర్జీదారులు ముక్కులు మూసుకుని ఇబ్బంది పడుతున్నారు. ఈ దారుణమైన పరిస్థితుల వల్ల ముఖ్యంగా మహిళలు, వృద్ధులు మరియు వికలాంగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కార్యాలయంలో పరిశుభ్రత లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నా, స్థానిక అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయం ఆవరణలో బ్లీచింగ్ పౌడర్ చల్లడం కానీ, రెగ్యులర్ క్లీనింగ్ చేయించడం కానీ జరగడం లేదని తెలుస్తోంది. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. కార్యాలయంలో పారిశుధ్య పనులు వెంటనే చేపట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



# మహారాష్ట్రలో శనీశ్వరుడిని దర్శించుకున్న కాంగ్రెస్ నేతల బృందం






**● మహారాష్ట్రలోని శని సింగ్నాపూర్ లో స్వామివారిని దర్శించుకున్న కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత విజయ్ కుమార్, రాష్ట్ర నేతలు నరేందర్, శేఖర్ యాదవ్**

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 9 (నగరనిజం ప్రతినిధి):** రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ కు చెందిన పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు మహారాష్ట్రలోని పవిత్ర పుణ్యక్షేత్రం శని సింగ్నాపూర్ ఆలయాన్ని సందర్శించారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ నేత, ఎస్సీ ఎస్టీ కమీషన్ జాతీయ సభ్యుడు విజయ్ కుమార్ తో కలిసి రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జెల్లపల్లి నరేందర్, శంషాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్.... గురువారం నాడు మహారాష్ట్రకు వెళ్లారు. ఈ మేరకు పవిత్ర పుణ్యక్షేత్రంశని సింగ్నాపూర్ ఆలయాన్ని సందర్శించిన కాంగ్రెస్ నేతల బృందం విజయ్ కుమార్, జెల్లపల్లి నరేందర్, గడ్డం శేఖర్ యాదవ్ తదితర నేతలు.... స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు తైలంతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. పవిత్ర పుణ్యక్షేత్రం శని సింగ్నాపూర్ ఆలయాన్ని సందర్శిస్తే దోషాలు తొలగిపోతాయని ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జెల్లపల్లి నరేందర్ తో పాటు శంషాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్ అభిప్రాయపడ్డారు.




## ట్రాన్స్‌జెండర్ల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక దృష్టి... అడిషనల్ కలెక్టర్ పాండు



**నగర నిజం సంగారెడ్డి, ఏప్రిల్ 9:-** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న హెల్త్ వీక్ కార్యక్రమాల్లో భాగంగా గురువారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ట్రాన్స్‌జెండర్ల కోసం నిర్వహించిన ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని అడిషనల్ కలెక్టర్ పాండు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలోని ప్రతి వర్గానికి సమానంగా నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని తెలిపారు. ట్రాన్స్‌జెండర్ సమాజం ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, అవసరమైన పరీక్షలు, చికిత్సలు అందించేందుకు ఇలాంటి ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం ఎంతో అవసరమన్నారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, డాక్టర్ శశాంక్, వైద్యులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## టీఎన్జీవో సభ్యత్వ నమోదుకు విశేష స్పందన



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 9 ( నగరనిజం ) :** టీఎన్జీవో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ విభాగం యొక్క సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభించిందని టీఎన్జీవో నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేనీ, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకట్, ముత్యాల సత్యనారాయణ గౌడ్, కోశాధికారి ఆర్. ఉమాదేవి మరియు కేంద్ర సంఘం నాయకులు హాజరయ్యారు. సభ్యత నమోదుకు కలెక్టరేట్ ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేశారని అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరు ధన్యవాదాలు తెలిపారు. టీఎన్జీవో సంఘం ద్వారా ఉద్యోగులకు మేలు జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో టీఎన్జీవో నాయకులు యశ్వంత్, రంగయ్య, శ్రీనివాస్ రావు, మహేందర్, మాధవ్ గౌడ్, వాణి ఆనంద్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రేశం మున్సిపల్ కార్మికులకు జీవో ప్రకారం జీతాలు చెల్లించాలి: సిఐటియు డిమాండ్

**నగర నిజం ఏప్రిల్ 9: సంగారెడ్డి జిల్లా** ఇంద్రేశం మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం జారీ చేసిన జీవో 65 ప్రకారం రూ.16,600 జీతాలు చెల్లించాలని సిఐటియు సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు బి. నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం ఇంద్రేశం మున్సిపల్ కమిషనర్‌కు సిఐటియు ఆధ్వర్యంలో మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఇంద్రేశం మున్సిపాలిటీ ఏర్పడి దాదాపు పది నెలలు గడిచినా, జీవో ప్రకారం కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం గ్రామపంచాయతీ కాలంలో ఉన్న వేతనాలనే కొనసాగిస్తూ కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. నెలకు కేవలం రూ.9,500తోనే కార్మికులు కుటుంబాలను పోషించుకోవాల్సి వస్తోందని అన్నారు. అంతేకాకుండా, ఈ



వేతనాలు కూడా ప్రతి నెల 10వ తేదీ లోపు చెల్లించకుండా ఆలస్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రతి నెల 6వ తేదీలోపు జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, అలాగే కార్మికులకు సంక్షేమ పథకాలు, భద్రతా సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులు, సబ్బులు, నూనెలు వంటి ప్రాథమిక సౌకర్యాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా, బచ్చుగూడెం వార్డు పరిధిలో అర్జున్, చిన్న కంజర్ల వార్డు పరిధిలో ఖదీర్ అనే కార్మికులు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందినప్పటికీ, వారికి రావలసిన బీమా నగదు ఇప్పటివరకు చెల్లించలేదని ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికులు మరణించిన సందర్భంలో వారి కుటుంబాలకు రూ.30 వేల ఆర్థిక సహాయం అందించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ఇంద్రేశం మున్సిపాలిటీ శరవేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఇంద్రేశం కమిటీ అధ్యక్షులు పోచయ్యతో పాటు మల్లేశం, నర్సింలు, శ్రీనివాస్, సుధాకర్, ఆంజనేయులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడంలో ముఖ్యమంత్రి బేష్ చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



**మొయినాబాద్, ఏప్రిల్ 09(నగర నిజం):** ఆర్థికంగా వెనుకబడిన ఆడపిల్లల పెండ్లిళ్లకు అండగా రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో ఆదర్శంగా నిలుస్తున్నాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూధన్ రెడ్డిలు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని మండల పరిషత్ కార్యాలయంలో వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాల చెక్కులను ఈ పంపిణీ కార్యక్రమాన్ని మండల తహసీల్దార్ గౌతమ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూధన్రెడ్డిలు పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధితో కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం ప్రజల కోసం పని చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 40 మంది లబ్ధిదారులకు 19 లక్షలు చెక్కులను అందజేశారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఆడపిల్లల వివాహం గౌరవ ప్రథంగా జరగాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాల ద్వారా బలంగా నిలుస్తుందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ప్రజలకు అండగా ప్రమాదంలో ఆర్థిక సహాయంగా నిలుస్తుందన్నారు. ప్రతి పేద కుటుంబానికి అవసరమైన సహాయంతో అందించడం ద్వారా ప్రభుత్వం బాధ్యతగా భావిస్తు ప్రజల సంక్షేమం కోసం ఇలాంటి పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నారన్నారు. ఈ పథకాల ద్వారా లబ్ధిపొందిన ప్రతి ఒక్కరు తమ జీవితాలలో కుటుంబాలలో ఎంతో వెలుగులు నింపుతున్నాయని పేర్కొన్నారు. వారు సుఖ సంతోషాలతో జీవించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ గౌతమ్కుమార్, మొయినాబాద్ మున్సిపల్ చైర్మన్ సోనియాదర్శన్, మున్సిపల్ కమిషనర్ జాఖీర్ అహ్మద్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కాలే శ్రీకాంత్, రంగారెడ్డి జిల్లా ఫిషర్ మెన్ చైర్మన్ నారాయణపురం మహేందరముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బంది అనిల్ ముదిరాజ్, సర్పంచ్లు మధ్య పాగ కృష్ణ, ఎలిగని వెంకటేష్ గౌడ్, అర్చనఅజయిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, ఆయా పార్టీ నాయకులు గడ్డం వెంకట్ రెడ్డి బండగూడ చీశైలంపటం రామిరెడి తదితరులు పాల్గొనారు

# కబ్జా కోరల్లో సీలింగ్ భూమి

- **భవన నిర్మాణాలు చేపడుతూ పేట్రేగిపోతున్న అక్రమార్కులు**
- **నిర్మాణాలకు ఎల్ ఆర్ ఎస్ లు ఉన్నాయంటూ బుకాయింపులు**
- **కబ్జాకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి**
- **అక్రమ భవన నిర్మాణాలను వెంటనే తొలగించాలి**
- **సీలింగ్ భూమిని పరిరక్షించి ప్రజల అవసరాల కోసం వినియోగించాలి**





**నగర నిజం న్యూస్ ఏప్రిల్ 9.** కీసర సర్కిల్ నాగారంఅసైన్డ్ భూమిని ఆక్రమించి ఎల్ ఆర్ ఎస్ లు ఉన్నాయంటూ భూకాయిస్తూ భవన నిర్మాణాలు చేపడుతూ పేట్రేయిపోతున్న అక్రమార్కుల పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ స్థానికులు డిమాండ్ చేస్తున్నారు మేడ్చల్ జిల్లా కీసర మండలం ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం పరిసర ప్రాంతంలో గల 87/2 సర్వే నెంబర్ కు చెందిన భూమికి పక్కన ఆరు ఎకరాల నాలుగు గుంటల విస్తీర్ణం కలిగిన పట్టా భూమి నేడు చండేశ్వర్ నగర్ కాలనీగా మంచి నివాసయోగ్యకరమైన విలువైన భూమిగా మారడంతో 87/2 సర్వేనెంబర్ కు చెందిన సీలింగ్ భూమిపై కొందరు అక్రమార్కులు డేగ కన్ను వేసి ఈ సీలింగ్ భూమిని ఆక్రమించి హస్తగతం చేసుకునేందుకు అధికారులను మభ్యపెట్టి భవన నిర్మాణాల కోసం అక్రమ మార్గంలో అనుమతులు కూడా పొందినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు ఈ అసైన్డ్ భూమి కబ్జా వ్యవహారంపై కీసర మండల తహసిల్దార్ సర్వేయర్ తో సర్వే చేయించి 87/2 సర్వే నెంబర్ కు చెందిన ఈ భూమిని పక్క సీలింగ్ భూమిగా నిర్ధారించి ఈ సీలింగ్ భూమిని పరిరక్షించడమే ఏకైక లక్ష్యంగా ఈ విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు అక్రమ మార్గంలో పొందిన భవన నిర్మాణాల అనుమతులను రద్దు చేయాలని స్వయంగా కీసర మండల తహసిల్దార్ హైదరాబాద్ హైడ్రా కమిషనర్ తో పాటు ఘట్కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్లకు నివేదికను అందజేయడం జరిగిందని స్థానికులు విన్నవిస్తున్నారు

### హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఘట్కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లు దృష్టి సారించాలి

మహానగర పరిధిలోని చెరువులు నాళాలు పార్కులు ప్రభుత్వ స్థలాల ను కబ్జాల నుండి పరిరక్షించడం కోసం జంట నగరాల్లోని అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తూ పర్యావరణ పరిరక్షణ మరియు వరద ముప్పు లేని నగర నిర్మాణం కోసం హైడ్రా ఒకవైపు చాకచక్యంగా అడుగులు వేస్తున్న ఈ సమయంలో చట్టానికి సవాల్ విసురుతూ ఒక ఎకరా పైచిలుకు గుంటల సీలింగ్ భూమిని చట్ట విరుద్ధంగా స్వాధీనపరుచుకోవడం నేరమని తెలిసి కబ్జా చేసి ఏకంగా భవన నిర్మాణాలు చేపడుతూ దుస్సాహసానికి ఒడిగడుతున్న ఈ అక్రమార్కులను ఐపీసీ సెక్షన్ 441 ప్రకారం శిక్ష అర్హులను చేసి అక్రమ మార్గంలో నిర్మిస్తున్న భవన నిర్మాణాల పట్ల హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఘట్కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లు ప్రత్యేక దృష్టి సారించి అక్రమ మార్గంలో నిర్మిస్తున్న భవన నిర్మాణాలను పూర్తిస్థాయిలో తొలగించి కబ్జా కోరల్లో విలవిలలాడుతున్న ఈ సీలింగ్ భూమికి అక్రమార్కుల చెరనుండి విముక్తి కలిగించి ప్రజా అవసరాల కోసం వినియోగ కరంగా ఉన్న ఈ భూమిని ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఉద్యానవనం కోసం ఈ స్థలాన్ని కేటాయించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు

Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE